

పార్శిల్ కార్యాలయాల్లో తనిఖీలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరులోని పలు పార్శిల్ కార్యాలయాల్లో వ్యవసాయ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పత్రాలు లేని రూ.13.68 లక్షల ఎరువులను జప్తు చేశారు.



2.15 లక్షల క్యూసెక్కులు విడుదల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు ఎనిమిది గేట్లను మూడు మీటర్లు ఎత్తి 2,14,788 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.



41,540 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 38,828 మిర్చి బస్తాలు రాగా, ఈ-నామ్ విధానం ద్వారా 41,540 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

నేడు కేంద్ర బృందం పర్యటన

జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి

కొల్లూరు/రేపల్లె రూరల్/వేమూరు: కృష్ణా వరదలకు లంక గ్రామాల్లో ఏర్పడిన విపత్తును పరిశీలించేందుకు కేంద్ర బృందం బుధవారం పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాలలోని కృష్ణా పరివాహక గ్రామాలలో పర్యటించనున్న కేంద్ర బృందం వరదల కారణంగా నష్టపోయిన పంటలను, ధ్వంసమైన గృహాలను, ఇతర నష్టాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. తొలుత వేమూరులో కేంద్ర బృందం ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం నుంచి ముంపు మండలాల్లో పర్యటిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఔత్సాహిక వ్యాపారవేత్తలకు శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలో నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 21వ తేది వరకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు సంస్థ జిల్లా అధికారి కొండా సంజీవరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్జాతీయ కార్మిక సంస్థ సౌజన్యంతో స్టార్ట్ యువర్ బిజినెస్ (ఎస్‌వైబి) ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్టు వివరించారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా మారాలనుకునే యువత తాము ప్రారంభించే వ్యాపార వివరాలతో తమ పేర్లు రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9160200652 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఈతకు వెళ్లి ఇరువురు దుర్మరణం



సంతోష్



సుధీర్

నరసరావుపేట రూరల్: ఈతకు వెళ్లి నీటమునిగి ఇరువురు దుర్మరణం పాలైన ఘటన రావిపాడు సమీపంలోని చిలకలూరిపేట మేజర్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. రావిపాడు పంచాయతీ పరిధిలోని బాలయ్యనగర్‌కు చెందిన పసుమర్తి సంతోష్(22), చిరుతుల సుధీర్(8) బంధువులు. మంగళవారం సాయంత్రం వీరు ఇరువురు చిలకలూరిపేట మేజర్ కేనాల్‌లో ఈతకు వెళ్లారు. కెనాల్‌లో లోతు ఎక్కువగా ఉండటంతో సుధీర్ మునిగిపోవడంతో అతని రక్షించేందుకు వెళ్లిన సంతోష్ నీటి ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. దీనిని గమనించిన స్థానికులు ఇరువురిని రక్షించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ కిశోర్ తెలిపారు.

ఐదేళ్ల నానో టెక్నాలజీ కోర్సులో అడ్మిషన్లకు ఆహ్వానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ నానో టెక్నాలజీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విభాగాధిపతి ఆచార్య వి.రవి కుమార్ తెలిపారు. 3వ విడత వెబ్ ఆప్షన్లు, రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు WWW.OAMDC.AP.GOV.IN వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ/బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు రీ ఎంబర్స్‌మెంట్, యునివర్సిటీ నిబంధనల ప్రకారం హాస్టల్, లైబ్రరీ సౌకర్యాలు ఉంటాయని వివరించారు. వివరాలకు 94915 49853, 99661 19781 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

సీట్ల భర్తీకి ఎన్జీ రంగా వర్సిటీ దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికిగాను ఎమ్మెస్సీ, ఎంటెక్, పీహెచ్‌డీ విభాగాల్లో సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానించింది. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామచంద్రరావురీ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన గడువును అక్టోబర్ 10వ తేదీ వరకు పొడిగించామని చెప్పారు. దరఖాస్తు చేశాక హార్డ్ కాపీలను వ్యక్తిగతంగాగానీ, పోస్ట్ ద్వారాగానీ అక్టోబర్ 15వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా చేరేలా పంపాలన్నారు. దరఖాస్తులు 'రిజిస్ట్రార్, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిపాలనా విభాగం, లాం ఫాం, గుంటూరు– 522034' చిరునామాకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

కౌలుకోలేని దెబ్బ



కొల్లూరు మండలం పెదలంకలో వరద ముంపునకు గురై పనికిరాకుండా పోయిన పసుపు, ఇతర వాణిజ్య పంటలు

కృష్ణా వరదలకు కౌలు రైతు కుదేలు

- కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో పూర్తిగా నీటమునిగిన పంటలు
- రూ.లక్షల పెట్టుబడి నీటిపాలు
- ఈ ప్రాంతాల్లో 80శాతంకు పైగా కౌలు రైతులే
- నష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వినతి
- ఎకరాకు రూ.లక్ష చెల్లిస్తేనే ఊరట అంటున్న కౌలు రైతు సంఘం నేతలు

కొల్లూరు: కృష్ణా వరదలు సృష్టించిన విలాయానికి కౌలు రైతులు బలయ్యారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో వ్యవసాయ రంగంలో అధికశాతం కౌలు రైతులే సేద్యం చేస్తుండటం పరిపాటిగా ఉంది. వరదలు పంటలను ముంచెత్తిన ఫలితంగా వాణిజ్య పంటలు పూర్తిగా కృష్ణార్పణం కావడంతో కౌలు రైతులు కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. కొల్లూరు, భట్టిప్రోలు, మండలాల్లోని కృష్ణా తీర గ్రామాలైన 26 గ్రామాల పరిధిలో సుమారు 10 వేల ఎకరాలకు పైగా వాణిజ్య పంటలైన అరటి, పసుపు, కంద, బొప్పాయి, తమలపాకు, జామ, కూరగాయల పంటలు సాగవుతున్నాయి. వరద దెబ్బకు ఊర్లతోపాటు, పొలాలు ముంపునకు గురవ్వడంతో ఒక్క పంటకూడా బతికి బట్టకట్టే అవకాశం లేకుండా పోయింది.

ఎకరాకు రూ.2–3 లక్షల పెట్టుబడి

అధిక పెట్టుబడులతో కూడుకున్న పంటలవడంతో ఒక్కో ఎకరాకు రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు పెట్టిన పెట్టుబడులు వరద ప్రవాహంలో కలసిపోయాయి. కొల్లూరు, భట్టిప్రోలు మండలాలలో 7,576 మంది వ్యవసాయదారులు సాగుచేస్తున్న 10,102.25 ఎకరాలలోని వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖాధికారులు ఇప్పటికే ప్రాథమిక అంచనాకు వచ్చారు. వ్యవసాయం చేస్తున్న వారిలో 80 శాతం వరకు కౌలు రైతులే ఉండటంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎకరాకు రూ. 55 వేల నుంచి రూ. 60 వేల వరకు కౌలు చెల్లించి చేపట్టిన సేద్యంలో మొదటి పంటే వరద ముంపునకు గురై పనికిరాకుండా పోవడంతో కౌలు రైతులు కుదేలయ్యారు.

ఆశలపై 'నీళ్లు'..

ఏడాదికి మూడు పంటలు పండే భూముల్లో, అంతర సాగుతో లాభాలు దక్కుతాయన్న కౌలు రైతుల ఆశలపై వరదలు నీళ్లు చల్లాయి. పచ్చటి పంటలతో కళకళలాడే పంటపొలాలు వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతూ మరుభూమిని తలపించేలా మారా యి. నేటికీ వరద ముంపులోనే ఉండి కుళ్లిపోయి పనికిరాకుండా నేలవాలిపోతున్న పంటలను చూసుకొని కౌలు రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

పెట్టిన పెట్టుబడి నీళ్లపాలు



కనిగిరిలంక ప్రాంతంలో ఎకరా భూమి రూ. 60 వేలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాను. ఈఏడాది పసుపు పంట సాగు చేశాను. చేతికొచ్చే సమయంలో వరదలు వచ్చి పూర్తిగా పంటలు తుడిచిపెట్టుకుపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కౌలు, పసుపు విత్తనం, ఎరువుల పెట్టుబడులకు వెచ్చించిన రూ.1.20 లక్షలు నీళ్లపాలయ్యాయి.

– తోడేటి కిశోర్, చింతర్లంక, కొల్లూరు మండలం

వ్యవసాయ రుణాలు రద్దు చేయాలి



రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను ప్రభుత్వం రద్దు చేసి కౌలు రైతులను ఆదుకోవాలి. ప్రైవేటు వ్యక్తులు తామిచ్చిన అప్పులు తిరిగి చెల్లించమని కౌలు రైతులపై ఒత్తిడి తీసుకురాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఎకరాకు రూ. లక్ష పంట నష్టం చెల్లిస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. **– తోడేటి సురేష్, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, కొల్లూరు**

కరకట్టలపై ఇసుక దోచేస్తే ఉపేక్షించం

- ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు
- ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి
- జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్ట్రయిట్ కట్ కాలువపై ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాల పరిశీలన



ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కరకట్టను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ

సాక్షి ఎఫెక్ట్

చీరాల టౌన్: స్ట్రయిట్ కట్ కాలువ కట్టలపై అక్రమంగా ఇసుకను తవ్వినా.. అమ్మకాలు చేసి భావితరాలకు ముప్పు వాటిల్లేలా చేసే అక్రమార్కులు ఎవ్వరినైనా ఉపేక్షించమని చీరాల ఆర్డీఓ జి.సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'కరకట్టలను కొట్టేసి–ఇసుక అమ్మేసి' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ వెంకటమురళి సత్వరమే స్పందించారు. ఘటనపై సమగ్రంగా విచారించి త్వరగా నివేదికలు అందించాలని చీరాల ఆర్డీఓను ఆదేశించారు. ఈ మేరకు చీరాల మండలంలోని బుర్ల వారిపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో, కీర్తివారిపాలెంలోని నగరవనం వెనుకవైపు అక్రమంగా కరకట్టలను ధ్వంసం చేస్తూ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ప్రాంతాలను చీరాల ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, చీరాల తహసీల్దార్ కె.గోపీకృష్ణ, సెబ్ సీఐ, డ్రైనేజీ ఏఈ, పోలీసు సిబ్బంది ఆర్డీఓ పరిశీలించారు. ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కరకట్టలపై గత కొద్దిరోజులుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నప్పటికీ గ్రామ, మండల స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంపై ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అధికారులు పట్టీపట్టనట్లు పనిచేయడం, భావితరాలకు ముప్పు వాటిల్లేలా కరకట్టల నుంచి పెద్ద ఎత్తున ఇసుకను తరలించి లక్షలు గడిస్తుండటం గర్హనీయమన్నారు. ప్రకృతి విపత్తులు, వరదలు, భారీ వర్షాల సమయంలో ఎగువ నుంచి వచ్చే వర్షపు నీరు ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ నుంచే సముద్రంలో కలుస్తుందని కానీ అక్రమంగా కట్టల నుంచి ఇసుకను తరలించడం వలన భారీ వర్షాల సమయంలో స్ట్రయిట్ కట్ సమీపంలోని గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అక్రమార్కులు ఎవరైనా, ఏ పార్టీకి చెందిన వారైనప్పటికి ప్రజలను ముంపునకు, ఇబ్బందులకు గురిచేసే వారిని వదలిపెట్టమన్నారు. ఏ మేరకు కరకట్టల నుంచి ఇసుకను తరలించారు.. ఎవరు తరలించారు, ముప్పు వస్తే జరిగే నష్టం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌కు నివేదికలు అందజేస్తామన్నారు. కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు. ఆర్డీఓ వెంట మండల సర్వేయర్ చార్లెస్, ఆర్ఐ శేఖర్, వీఆర్వోలు, పోలీసులు, తదితరులు ఉన్నారు.



కరకట్టలను కొట్టేసి.. ఇసుక అమ్మేసి

మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

రెచ్చిపోతున్న పచ్చ మూకలు

- పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఆగని దాడులు
- గతంలో దారికాచి సాంబిరెడ్డిపై హత్యాయత్నం
- మహిళా జెడ్పీటీసీ ఇంటిపై అర్ధరాత్రి దాడికి యత్నం
- గ్రామాలు విడిచి వెళుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు
- ఆస్తుల ధ్వంసానికి పాల్పడుతున్న కూటమి నేతలు
- మాజీ ఎమ్మెల్యేపై దాడి చేసేందుకు ప్రణాళికలు
- నియోజకవర్గంలో అడుగుపెట్టనీయకుండా శంకరరావుపై ఆంక్షలు



టీడీపీ నాయకుల దాడిలో రెండు కాళ్లు విరిగి చికిత్స పొందుతున్న ఈదా సాంబిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు (ఫైల్)



తీవ్రంగా గాయపడిన సర్పంచ్ అర్తిమళ్ల నాగేశ్వరరావు (ఫైల్)



మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకుడు కూరపాటి వాసు కారుపై దాడి చేసేందుకు ఉరుకుతున్న టీడీపీ కార్యకర్తలు, నాయకులు

పెదకూరపాడు: పల్నాడు జిల్లాలో పచ్చమూకల ఆగడాలు ఆగడం లేదు. పెదకూరపాడు నియోజకవర్గంలో రోజూ ఏదో ఒక చోట టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ నేతలపై దాడులకు పాల్పడుతున్నారు. పక్కా ప్రణాళికతో దాడులు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ కేడర్‌ను భయభ్రాంతులను చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. మహిళ జెడ్పీటీసీని వేధింపులకు గురిచేస్తున్నారు. కీలక నేతలే లక్ష్యంగా దారి కాచి దాడులకు తెగబడుతున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తూ కీలక నేతలు గ్రామాలు విడిచి వెళ్లేలా చేస్తున్నారు. రాడ్‌లు, కర్రలు, రాళ్లతోనే దాడులు చేస్తున్నారు.

దారికాచి సాంబిరెడ్డిపై హత్యాయత్నం

క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డిపై హత్యాయత్నం చేశారు. జూన్ 23వ తేదీన మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో సమావేశం ముగించుకుని వస్తున్న సమయంలో అమరావతి మండలం ఉటుకూరు వద్ద దారి కాచి పది మంది గుర్తుతెలియని టీడీపీకి చెందిన అల్లరి మూకలు కారు రోడ్డుకు అడ్డుపెట్టి కారులో ఉన్న సాంబిరెడ్డిని బయటకు లాగి రెండు కాళ్లు, చేతులు విరిగేలా కర్రలు, రాడ్‌లతో దాడిచేశారు. ఈదా సాంబిరెడ్డి తోపాటు, ఆయన అనుచరులు కీసర గంగాధరరెడ్డి, కల్లి శ్రీనివాసరెడ్డి, చిర్రా దామోదర్‌రెడ్డిలను బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారు.

సర్పంచ్ కుటుంబాన్ని సర్వనాశనం చేశారు

పెదకూరపాడు మండలం కంభంపాడు గ్రామ సర్పంచ్ అర్తిమళ్ల నాగేశ్వరరావు, ఆయన సతీమణి ఎంపీటీసీ అంజమ్మ, కుమారులు రాజశేఖర్, ప్రవీణ్, అర్తిమళ్ల తిరుపతమ్మ, ఎస్సీ కాలనీకి చెందిన సురేష్, బీసీ సామాజిక వర్గానికి చెందిన బ్రహ్మం, కత్తిపాటి కృష్ణవేణిలపై ఎన్నికల రోజు రిగ్గింగ్‌ను అడ్డుకున్నారని టీడీపీ అల్లరి మూకలు మే 14న రాత్రి సమయంలో ఇళ్ల మీదకు వెళ్లి దాడులు చేశారు. సర్పంచ్ నాగేశ్వరరావు రెండు కాళ్లు విరగొట్టారు. ఎస్సీకాలనీపైకి వెళ్లి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇళ్ల నుంచి బయటకు లాగి విచక్షణా రహితంగా కొట్టారు. ఇళ్లల్లో సామాన్లు ధ్వంసం చేశారు. దీంతో పైన తెలిపిన కుటుంబాలు గ్రామాలు విడిచి వేరే ప్రాంతాల్లో తలదాచుకుంటున్నాయి. నేటికి కూడా పలువురిని విచారణ పేరుతో ఫోన్ చేసి పోలీసుస్టేషన్‌కు పిలిపించి బెదిరిస్తున్నారు.

అర్ధరాత్రి మహిళా జెడ్పీటీసీపై దాడికి యత్నం

పెదకూరపాడు జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, ఆమె భర్త శివాజీలు ఎన్నికల అనంతరం హైదరాబాద్‌లో పిల్లల చదువు నిమిత్తం నివాసం ఉంటున్నారు. ఇటీవల ఆగస్టు 18న అర్ధరాత్రి సమయంలో వారు కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన గారపాడు గ్రామానికి వచ్చారు. జెడ్పీటీసీ స్వర్ణకుమారి, భర్త శివాజీలు స్వగ్రామానికి రావడం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు శివాజీ బయటకు రావాలంటూ నీ అంతు తేలుస్తామంటూ ఇళ్ల తలుపులు పగులగొట్టి గృహంలోకి బలవంతంగా వెళ్లే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో ఇంట్లో శివాజీ లేడని, మహిళలు మాత్రమే ఇంట్లో ఉన్నారని, మహిళలపై దాడి చేస్తారా అంటూ ప్రశ్నించారు. అంతకు ముందు ఇదే గ్రామంలో ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే కర్రలు, రాడ్‌లతో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఇళ్ల వద్ద హల్‌చల్ చేశారు.

ఎనికపాడులో వైఎస్సార్ సీపీ నేతల ఆస్తులు ధ్వంసం

అమరావతి మండలం ఎనికపాడు గ్రామంలో దేవరపల్లి వెంకటేశ్వర్లు అనే కార్యకర్త నివాసంపై దాడులకు తెగబడ్డారు. వెంకటేశ్వర్లుకు సంబంధించిన ట్రాక్టర్, ఇంట్లో ఫ్రిజ్, టీవీ, విలువైన సామాన్లు ట్రాక్టర్‌లో తీసుకెళ్లి చెరువులో పడేశారు. వెంకటేశ్వర్లు గ్రామం విడిచి పారిపోయాడు. నరుకుళ్లపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు.

టీడీపీ దాడులు హేయం : జెడ్పీటీసీ



క్రోసూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద ముంపునకు గురై నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలిసి వచ్చేందుకు సిద్ధమవుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణుల వాహనాలపై టీడీపీ శ్రేణులు దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయటం దుర్మార్గమని, ప్రజలందరూ ఈ దాడులను ఖండించాలని క్రోసూరు జెడ్పీటీసీ సభ్యురాలు షేక్ జమీలా, పార్టీ నాయకులు షేక్ గఫూర్ కోరారు. వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలీసుల సమక్షంలో టీడీపీ గుండాలు రెచ్చిపోయి కర్రలు, రాళ్లతో దాడులు చేశారని అన్నారు. ప్రజాస్వామ్యంలో బతుకుతున్నామా అనే అనుమానం కలుగుతుందని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి రెడ్‌బుక్ రాజ్యాంగం పాలన చేస్తోందని విమర్శించారు. ఎల్లకాలం ఇలాంటి దౌర్జన్యాలు సాగవని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నియోజకవర్గంలో ఎనలేని సేవలు అందించారని అన్నారు. ప్రజలసమస్యలు కోసం వైఎస్సార్ సీపీ నిరంతరం పోరాడుతుందని, అది ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కు అని అన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ జోక్యం చేసుకుని దాడులు చేసిన టీడీపీ శ్రేణులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

శంకరరావుపై దాడి చేసేందుకు కుట్ర

పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వరద ప్రభావంతో నష్టపోయిన పంట పొలాలు పరిశీలించి, రైతులను ఓదార్చేందుకు వస్తుండగా పక్కా ప్రణాళికతో ఆయనపై దాడి చేసేందుకు కర్రలు, రాళ్లు, రాడ్‌లతో కూడిన వాహనాలను పలు గ్రామాల్లో సిద్ధంగా ఉంచారు. శంకరరావు రాక ఆలస్యం కావడంతో 14వ మైలు వద్ద కార్యకర్తల వాహనాలు ధ్వంసం చేశారు. పోలీసుల సమక్షంలోనే ఇంత జరుగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

ప్రజాస్వామ్యంలో దాడులు సరికాదు



అధికారం శాశ్వతం కాదు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సరికాదు. సాంబిరెడ్డిపై, పార్టీ ఇతర నేతలపై వరుస దాడులు జరుగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కేడర్‌ను చెల్లాచెదురు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుంది.

– బెల్లంకొండ మీరయ్య, ఎంపీపీ పెదకూరపాడు

మాజీ ఎమ్మెల్యేను అడ్డుకోవడం దారుణం



నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిన మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావును అడ్డుకోవడం దారుణం. కష్టాల్లో ఉన్న రైతులను పరామర్శించడం కూడా నేరమా? గత ఐదేళ్లలో ఇలాంటివి ఎప్పుడైనా చేశారా.

– భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ అమరావతి మండల అధ్యక్షుడు

వరుస దాడులకు పాల్పడుతున్నారు



ప్రశాంతంగా ఉండే పెదకూరపాడులో అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. పగ పట్టినట్లు టీడీపీ కూటమి నేతలు ప్రణాళికతో దాడి చేస్తున్నారు. పోలీసు వ్యవస్థ దాడులను అడ్డుకోలేకపోతోంది.

– కోటయ్య, ఎంపీపీ, క్రోసూరు

క్లుప్తంగా

వరద బాధితులకు సాయం



మంగళగిరి: వరద బాధితులకు రూ.9 లక్షల విలువైన ఆహార పదార్థాలు, నిత్యావసర సరకులు, కిట్లు ఇవ్వడానికి మండలంలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ముందుకొచ్చింది. మంగళవారం యూనివర్సిటీ నుంచి వాటితో కూడిన వాహనాలను వీసీ మనోజ్ అరోరా ప్రారంభించారు. బాధితులకు ఈ వస్తువులను పంపిణీ చేయడానికి వాహనాల్లో తరలించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు అనూప్ సింగ్, చంద్రప్రభు, వేణుగోపాల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఇద్దరు ఎంపిక

నరసరావుపేట రూరల్: రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టుకు శంకర భారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇరువురు ఎంపికైనట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరులోని ఎన్‌జీవో హోమ్‌లో ఈనెల 8వ తేదీన నిర్వహించిన జిల్లా జట్ల ఎంపిక పోటీలలో పాఠశాలకు చెందిన మానస, ఎస్‌కె ఆరీఫ్‌లు ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికై నట్టు వివరించారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఝాన్సీరాణి, ఎస్‌కె.ఫాతిమా, పి.తిరుపతిరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

పిడుగురాళ్ల: అప్పుల బాధ తట్టుకోలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కరాలపాడు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి పట్టణ సీఐ మోహన్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ సైదా (37) పంటలు సక్రమంగా పండకపోవటంతో అప్పులు ఎక్కువై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడు సైదాకు ఎకరం ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ, మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని వరి, మెట్ట పంటలు వేశాడు. మూడేళ్ల నుంచి సక్రమంగా పంటలు పండక పోవటంతో పెట్టుబడులకు తెచ్చిన అప్పులు, వడ్డీలు కలిపి సుమారు రూ.10 లక్షల అప్పు అయిందని, ఈ క్రమంలో భార్య ఫర్వీన్ పొలానికి వెళ్లటం, పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న మహ్మద్ సైదా ఇంట్లో ఫ్యాన్‌కి ఉరివేసుకొని మృతి చెందాడు. సాయంత్రం పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి రావటంతో వేసిన తలుపులు తెరవటంతో మహ్మద్ సైదా ఫ్యాన్‌కి వేలాడుతూ కనిపించాడు. ఇరుగు పొరుగు వారు వచ్చి చూసేసరికి సైదా మృతి చెంది ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ మోహన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య ఫర్వీన్‌తోపాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- లంక గ్రామాల్లో నీట మునిగిన పంటల పరిశీలన

కొల్లూరు/భట్టిప్రోలు/రేపల్లె రూరల్/చెరుకుపల్లి: కృష్ణా వరదలు కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఈపూరులంక, సుగ్గునలంక, పెసర్లంక గ్రామాల్లో జిల్లా కలెక్టర్ పర్యటించి వరద ముంపునకు గురైన అరటి, బూడిద గుమ్మడి, పసుపు, కంద వంటి వాణిజ్య పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా రూ. లక్షల్లో పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు వరదల కారణంగా పనికిరాకుండా పోవడంపై రైతులు ఆయనను కలసి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదుకోవాలని కోరడంతో ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని అధైర్యపడాల్సిన పనిలేదని ఆయన రైతులకు వెల్లడించారు. అనంతరం ఆయన పెసర్లంక అరవింద వారధి సమీపంలో కృష్ణా నది నక్కపాయ గండికి పోసిన అడ్డుకట్ట తెగిన ప్రాంతాన్ని పరిశీలించారు. జేసీ ప్రఖర్ జైన్, రేపల్లె, చీరాల ఆర్డీఓలు హేలా షారోన్, సూర్యనారాయణరెడ్డి ఉన్నారు.

గతంలో పడిన గండి పరిశీలన...

కృష్ణానదికి 2009లో సంభవించిన వరదలకు భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం వద్ద పడిన గండిని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, జేసీ ప్రఖర్‌జైన్, ఆర్డీఓ హేలాషారోన్, వివిధ శాఖల అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. కేంద్ర బృందం బుధవారం ఈ గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించనుంది. ఈ సందర్భంగా ముందస్తుగా కలెక్టర్ ఆ ప్రాంతాన్ని సందర్శించి అధికారులను అడిగి వివరాలు సేకరించారు. కరకట్ట వద్ద గతంలో సంభవించిన వరదకు జరిగిన నష్టం, ప్రస్తుత పరిస్థితిని గూర్చి అంచనాలను రూపొందించాలని రివర్ కన్జర్వేషన్ డీఈ భాను బాబు, ఏఈ నాగేశ్వరనాయక్‌లను ఆదేశించారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది..

పంట సాగుచేస్తూ వరదలతో నష్టపోయిన రైతుల్ని ఆదుకునేలా సర్వేలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మండలంలోని రావిఅనంతవరం వద్ద బలహీనంగా ఉన్న కరకట్టను మంగళవారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. వరద నీట మునిగిన గృహాలను పరిశీలించి పరిహారం అందేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా పంట నష్టపరిహారాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ–క్రాప్‌లో పంట వివరాలు నమోదు కాకపోయినప్పటికీ నష్టపరిహారం అందేలాచర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.



ఓలేరు పల్లెపాలెం వద్ద 2009లో పడిన గండి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకట మురళి, జేసీ ప్రఖర్ జైన్, ఆర్డీఓ హేలాషారోన్, వివిధ శాఖల అధికారులు



కొల్లూరు మండలం సుగ్గునలంక వద్ద పాడైపోయిన అరటి తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

చెరుకుపల్లిలో...

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మునిగిపోయిన పొలాలకు నష్టం అంచనా వేసి అధికారులు నివేదికను సిద్ధం చేస్తున్నారని త్వరలోనే రైతులకు న్యాయం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. బుధవారం మండలంలో కేంద్ర బృందం పర్యటించనుండటంతో మండలంలోని కనగాల మరియు పరిసర ప్రాంతాల్లో వరద ప్రభావానికి ముంపునకు గురైన వరి పొలాలను మంగళవారం కలెక్టర్ అధికారులతో కలసి సంర్శించి పరిశీలించారు. డీఏఓ వై.రామకృష్ణ, తహసీల్దార్ సిహెచ్ పద్మావతి ఉన్నారు.

పంట నష్టం అంచనాలు తయారు చేస్తున్నాం

కర్లపాలెం: భారీ వర్షాలకు నీట మునిగి దెబ్బతిన్న పంటల నష్టం వివరాలను నమోదు చేస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ తెలిపారు. ఇటీవల భారీ వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి మంగళవారం పరిశీలించారు. పంట నష్టం అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. పంట నష్టం వివరాలను స్థానిక రైతు భరోసా కేంద్రాలలో సామాజిక తనిఖీ కోసం ఉంచుతామన్నారు.

నాడు కుయ్ కుయ్... నేడు నై నై..!

- కూటమి ప్రభుత్వంలో 108 వాహన సేవల దుస్థితి
- 40 నిమిషాలపాటు పదుల సంఖ్యలో కాల్స్‌కూ నో రెస్పాన్స్

ప్రత్తిపాడు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కాల్ చేసిన నిమిషాల వ్యవధిలోనే కుయ్.. కుయ్‌మంటూ 108 వాహనం ప్రాణాలు కాపాడేందుకు దూసుకొచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడు కాల్ చేసినా దిక్కులేకుండా పోయింది. సామాన్యుడి ప్రాణాలకు భరోసా కలిగేలా సకాలంలో వైద్య సేవలు అందడం గగనమైపోతోంది. ఆపత్కాలంలో ప్రజలకు అత్యవసర సేవలందించాల్సిన 108 వాహనం ఆచూకీ లేకుండా పోతోంది. ప్రజలు ఫోన్లు చేసినా స్పందించే నాథులే లేరు. అందుకు దర్పణమే ఇక్కడ కనిపిస్తున్న చిత్రం. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన బాణాల కృష్ణ మోహన్ రెడ్డి మంగళవారం సాయంత్రం 3 గంటల సమయంలో గుంటూరు నుంచి ప్రత్తిపాడు వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఉన్నట్టుండి ఫిట్స్ వచ్చి కొట్టుకుంటూ కింద పడిపోయారు. అటుగా వెళుతున్న వారు మానవతా దృక్పథంతో ఆగి 108కు ఫోన్ చేశారు. సుమారు 40 నిమిషాలపాటు ఎంత మంది ఎన్నిసార్లు కాల్ చేసినా వాహనం మాత్రం రాలేదు. ఫోన్ లిఫ్ట్ చేసి రకరకాల ప్రశ్నలు, అడిగినవే మళ్లీ అడుగుతూ సిబ్బంది సమయం వృథా చేశారు. వాహనం మాత్రం వస్తే ఒట్టు. అదే సమయంలో అటుగా వెళుతున్న ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఓ మహిళా వైద్యాధికారి కూడా కృష్ణ మోహన్ రెడ్డి పరిస్థితిని చూసి ఆగారు. డాక్టర్ సైతం 108కు ఫోన్ చేసినప్పటికీ సమాధానం రాలేదు. దీంతో స్థానికులు, బంధువులే ఆటోలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించాల్సిన దుస్థితి దాపురించింది.



రోడ్డు పక్కనే కింద పడి గిలగిలా కొట్టుకుంటున్న కృష్ణమోహన్ రెడ్డి

168 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



నాదెండ్ల: యడ్లపాడు మండలం తిమ్మాపురం జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో తహసీల్దార్ విజయశ్రీ, డీటీ శ్యామలత, వీఆర్వోలు రాయుడు మిల్లును తనిఖీ చేశారు. అదే సమయంలో లారీలో లోడ్ చేస్తున్న 132 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 36 క్వింటాళ్ల నూకలను గుర్తించారు. సొలస గ్రామానికి చెందిన కిలారు వీరాంజనేయప్రసాద్ తిమ్మాపురంలో ఓ మిల్లును లీజుకు తీసుకుని రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టించి నూకలుగా మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం లారీలో రేషన్ బియ్యం బస్తాలపై నూకల బస్తాలు ఉంచి తరలించేందుకు సిద్ధమయ్యారు. టీడీపీ నేతల మధ్య నెలకొన్న విభేదాలతో మంగళవారం ఓ నేత అనుచరుడి మిల్లులో అక్రమంగా ఉంచిన రేషన్ బియ్యం గురించిన సమాచారాన్ని మరో నేత అనుచరులు రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. దీంతో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్ష

మంగళగిరి: చెక్కు బౌన్స్ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్షతోపాటు ఫిర్యాదుదారుడికి రూ 5.50 లక్షలు చెల్లించాలని మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు మంగళవారం తీర్పు వెలువరించారు. ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరికి చెందిన వడిసె సురేష్ వద్ద కొల్లిపర నివాసి తూమాటి పీటర్ 2019లో రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 2021లో రూ.5.50 లక్షలకు చెక్కు ఇచ్చాడు. దానిని బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయింది. పీటర్‌పై మంగళగిరి కోర్టులో కేసు దాఖలు చేయగా విచారణ కొనసాగింది. ఇరువర్గాల వాదనలు విన్న జడ్జి సదరు నిందితుడు పీటర్‌కు ఏడాది జైలు శిక్ష విధించారు. రూ 5.50 లక్షలు చెల్లించాలని తీర్పు వెలువరించారు.

క్షమాపణ చెప్పించి వదిలేశారు

- బలహీన వర్గాల వ్యక్తితో క్షమాపణ చెప్పించుకున్న టీడీపీ నాయకుడు
- నాలుగేళ్లు మౌనంగా ఉండకుంటే కేసులు పెట్టి బయటకు రాకుండా చేస్తామని బెదిరించిన ఎస్‌ఐ

కొల్లూరు: కృష్ణా పరివాహక ప్రాంత ప్రజలు వరద ముంపు కారణంగా పడుతున్న బాధలు చాలవన్నట్లు టీడీపీ నాయకుల కుటిల రాజకీయాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కృష్ణనగర్‌కు చెందిన బాధితుడు అర్జునరావు కథనం మేరకు... మండలంలోని తోకలవారిపాలెం శివారు కృష్ణనగర్‌కు చెందిన కుక్కల అర్జునరావు తమ గ్రామం వద్ద పంట పొలాలలో నీరు మళ్లించడానికి టీడీపీ నాయకులు చేసిన యత్నాన్ని ప్రశ్నించడంతో పోలీసులు బలవంతంగా స్టేషన్‌కు తరలించిన విషయం విదితమే. ఎస్‌ఐ ఏడుకొండలు అర్జునరావును వ్యక్తిగత పూచీకత్తుపై పంపించి మళ్లీ స్టేషన్‌కు రావాలంటూ ఒత్తిడి చేశాడు. దీంతో అర్జునరావు తన గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులతో పాటు, లాయర్‌ను తీసుకుని సోమవారం రాత్రి స్టేషన్‌కు వెళ్లాడు. అప్పటికే టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ స్టేషన్‌లో ఉన్నాడు. కృష్ణనగర్ వాసులు, లాయరు మైనేనితో మాట్లాడి తమ గ్రామం వద్ద రహదారికి గండి పెట్టి నీరు మళ్లిస్తే తమ పొలాలతోపాటు, గ్రామానికి ముప్పు వాటిల్లుతుందన్న భయంతోనే మేము గండి పెట్టకుండా అడ్డుకున్నామని ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదని తెలిపారు. అనంతరం బాధితుడు అర్జునరావును పిలిచి క్షమాపణ చెపితే కేసు లేకుండా వదిలేస్తామని ఒత్తిడి చేశారు. తాము తలుచుకుంటే బయటకు రాకుండా కేసులు పెట్టి లోపల వేస్తామని బెదిరించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అర్జునరావు క్షమాపణ వేడుకున్నాడు. అనంతరం ఎస్‌ఐ ఈ నాలుగేళ్లలో ఏవిషయం మీదైనా నోరెత్తి ప్రశ్నించినా, ఇటువంటి సంఘటనల్లో ఉన్నట్లు తెలిసినా బయటకు రానివిధంగా కేసులు నమోదు చేసి లోపలకు పంపిస్తామని, తాను ఉన్నంతవరకు ఎక్కడా కనిపించ రాదని హెచ్చరించి, గ్రామస్తుల పూచీకత్తుతో విడిచి పెట్టాడు. టీడీపీ నేతలు గ్రామాలలో రాకపోకలకు వినియోగించే ఆర్‌అండ్‌బీ రోడ్లకు గండ్లు కొట్టి మరో మూడు గ్రామాలకు ముప్పు వాటిల్లేలా వ్యవహరించడమే కాకుండా, ప్రజలపై వేధింపులకు దిగడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వారికి పోలీసులు అండగా నిలవడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

- జరిగిన ఘటనపై ఎస్‌ఐ జి.ఏడుకొండలు వివరణ కోరగా, తాను బలవంతంగా క్షమాపణలు చెప్పించినట్లు వస్తున్న ఆరోపణలల్లో వాస్తవం లేదన్నారు. ఆ గ్రామానికి చెందిన పెద్దలు, ఓ లాయరు స్టేషన్‌కు వచ్చారని, వారందరూ బయట మాట్లాడుకొని నావద్దకు వచ్చి ఇకపై ఎటువంటి గొడవలకు వెళ్లనని అర్జునరావు చెప్పడంతో బైండోవర్ చేసుకొని పంపించానన్నారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజకవర్గంలో వినాయక చవితి నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పట్టణంలోని ప్రతి వార్డులో, మండలంలోని ప్రతి గ్రామంలో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. పట్టణంలోని నాగార్జుననగర్‌లోని శ్రీశ్రీ నగర్‌లో ప్రతిష్ఠించిన 61 అడుగుల భారీ మట్టి వినాయకుని విగ్రహం భక్తులను ఆకట్టుకుంటుంది. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మంగళవారం 61 అడుగుల మట్టి వినాయకుడిని దర్శించి పూజలు చేశారు. పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఆయన సందర్శించారు. పట్టణంలోని పలు వార్డుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. పట్టణంలోని 3వ వార్డు పరిధిలోని మాస్టిన్‌పేటలో వినాయక విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన అన్నసంతర్పణలో మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ పాల్గొని భక్తులకు ఆహార పదార్థాలు వడ్డించారు. 4వ రోజు కావడంతో మంగళవారం కొన్ని వినాయక విగ్రహాలను కోలాహలంగా ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. నృత్యాలతో సందడి చేశారు. భక్తిశ్రద్ధలతో గణేష్‌నికి వీడ్కోలు పలికారు.



పట్టణంలోని శ్రీశ్రీనగర్‌లో మట్టి వినాయక విగ్రహం వద్ద పూజల్లో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు

బ్లూబెల్స్ హెచ్‌ఎంకు పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు

అచ్చంపేట: జాతీయ స్థాయి పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డును లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ మురుగుడు శ్రీహరి నుంచి స్థానిక బ్లూబెల్స్ హైస్కూలు ప్రధానోపాధ్యాయిని ఏరువ మేరీ శ్రీలత అందుకున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన కార్యక్రమంలో కెనడీ నెక్స్ట్ జనరేషన్ వారు తనకు ఈ అవార్డు ప్రదానం చేశారన్నారు. ఉత్తమ విద్యాబోధనలో అత్యుత్తమ భావితరాలను రూపుదిద్దే ఉపాధ్యాయులను గుర్తించి ఇచ్చే ఈ అరుదైన అవార్డు రావడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని అన్నారు. ఈ అవార్డుతో తాను మరింత బాధ్యతతో ఉత్తమ విద్యార్థులను తీర్చి దిద్దుతానని చెప్పారు. పాఠశాల డైరెక్టర్ నిర్మలజ్యోతి, జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు అవార్డు గ్రహీత మేరీ శ్రీలతను అభినందించారు.



పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు అందుకుంటున్న మేరి శ్రీలత

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

- కుటుంబ వివాదాలతో విశ్రాంత ఉద్యోగిపై దాడి
- స్నేహితులతో కలిసి కోడలి తమ్ముడి ఘాతకం
- విజయవాడకు చెందిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

నరసరావుపేటటౌన్: విశ్రాంత విద్యుత్ శాఖ ఉద్యోగిపై హత్యాయత్నానికి పాల్పడ్డ కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ విజయచరణ్ మంగళవారం తెలిపారు. ప్రకాష్‌నగర్ సిరి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న చేవూరి రాధాకృష్ణపై ఏడాది కిందట గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. తిరిగి మరోమారు గత నెల 28వ తేదీన హైదరాబాద్ వెళ్లేందుకు భార్యతో కలిసి నడిచి వెళ్తుండగా దాడికి పాల్పడిన సంఘటన తెలిసిందే. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో రాధాకృష్ణ కోడలి తమ్ముడు శికాకొల్లి వంశీకృష్ణ అతని అనుచరులతో కలిసి నేరానికి పాల్పడినట్లు తెలుసుకున్నారు. వంశీకృష్ణ అక్క శికాకొల్లి దివ్యకు 18 సంవత్సరాల కిందట నరసరావుపేట పట్టణానికి చెందిన చేవూరి రాధాకృష్ణ కుమారుడు చేవూరి ప్రదీప్‌తో వివాహం జరిగింది. తరువాత భార్యాభర్తలు ఇద్దరూ అమెరికాలో పౌరసత్వం పొంది అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో దివ్యకు మతిస్థిమితం లేదని భార్యాభర్తలు ఇద్దరు అమెరికా కోర్టులో విడాకులు తీసుకున్నారు. అయితే ఆమె ఇండియాకు రాకుండా పిల్లలను చూసుకుంటూ అక్కడే ఉంటుంది. ఈ విషయమై ఇరువురి కుటుంబాలకు మధ్య గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాధాకృష్ణకు ఏదైనా జరిగితే కుమారుడు చేవూరి ప్రదీప్, దివ్యలు స్వగ్రామానికి వస్తారని ఇక్కడ పెద్దవాళ్లతో కూర్చొని పరిష్కరించుకోవచ్చన్న ఉద్దేశంతో దాడికి వ్యూహం రచించాడు. దీంతో రాధాకృష్ణపై విజయవాడకు చెందిన శికాకొల్లి వంశీకృష్ణ, అతని స్నేహితులు ఆవుల రాజ్‌కుమార్, కొణతాల హరిబాబు, ఉప్పు రవికుమార్‌లతో కలిసి దాడికి పాల్పడ్డారు. గతంలో రాధాకృష్ణపై పెప్పర్ స్ప్రే ప్రయోగించి దాడికి పాల్పడి అతని వద్ద చైన్ లాక్కున్నది కూడా పై నేరస్తులేనని విచారణలో తేలిందన్నారు. దీంతో రెండు కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

బ్రహ్మంగారి దేవాలయంలో చోరీ

పెదకూరపాడు: బ్రహ్మంగారి దేవాలయంలో హుండీ పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లిన సంఘటన పెదకూరపాడులోని కాలచక్ర రహదారిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దేవాలయం ముఖ ద్వారం గేటు తాళాలు గడ్డపారతో పగులగొట్టి దేవాలయంలోకి ప్రవేశించి, దేవాలయంలో గర్భగుడి పక్కన ఉన్న హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదు దోచుకెళ్లారు. గత సంవత్సరం నుంచి హుండీని తెరవలేదని నిర్వాహకులు తెలిపారు. దేవాలయం పూజారి తాళ్లూరి మల్లికార్జునరావు రోజు మాదిరిగానే మంగళవారం తెల్లవారుజామున పూజలు నిర్వహించేందుకు దేవాలయానికి రాగా, ముఖద్వారం తాళాలు, హుండీ పగులగొట్టి ఉండటం గమనించి దేవాలయం కమిటీ నిర్వాహకులకు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ బాలు నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని హుండీని పరిశీలించారు.



హుండీని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

వైఎస్సార్ గుర్తులను చెరపలేరు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్

మాచర్ల: దివంగత ముఖ్యమంత్రి, మహనీయుడు, పేదల పెన్నిధిగా రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆనవాళ్లను చెరిపేసేందుకు పలుచోట్ల ఆయన విగ్రహాలను ధ్వంసం చేయటం, దహనం చేయటానికి తెలుగుదేశం నాయకులు పాల్పడటం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రింగురోడ్డు సెంటర్‌లో కాన్ఫరెన్సు హాలులో విలేకరులతో మాట్లాడారు. పల్నాడు జిల్లాలోని కారంపూడి మండల కేంద్రంలో కోట బురుజు సెంటర్ వద్ద ఉన్న వైఎస్ విగ్రహాన్ని దుండగులు సోమవారం అర్ధరాత్రి దహనం చేసేందుకు ప్రయత్నించారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఇటువంటి దారుణాలు పెరిగిపోయాయన్నారు. దాడులు, దౌర్జన్యాలు మహనీయుడు వైఎస్సార్ విగ్రహాలను సైతం వదలకపోవటం సిగ్గుచేటన్నారు. పైశాచికానందంతో తమ ప్రజానాయకుడి విగ్రహాన్ని దహనం చేయాలనుకోవటం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఈ సంఘటనకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి వారిని వెంటనే అదుపులోకి తీసుకొని కఠినంగా శిక్షించాలన్నారు. అలా చేయకుండా కూటమి ప్రభుత్వం హింసను ప్రేరేపిస్తూ రాజశేఖర్‌రెడ్డి కుటుంబ చరిత్రను లేకుండా చేయాలనే ప్రయత్నాలు చేస్తే ప్రజా ఉద్యమం తప్పదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా ఏకమై రాజన్నకు జేజేలు పలికి దుష్టులకు బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

అటవీశాఖ భూమి వినియోగానికి అనుమతి

మంగళగిరి: రాజధాని అమరావతి నిర్మాణంలో విద్యుత్ వినియోగానికి ఎయిమ్స్ నుంచి అటవీ శాఖ భూమిని ఉపయోగించుకునేందుకు అనుమతి లభించినట్లు విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిమ్స్ ఆవరణలోని అటవీశాఖకు చెందిన భూమిలో విద్యుత్ హై పవర్ లైన్ నిర్మాణానికి అనుమతులు లభించడంతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. అమరావతికి విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వడ్డీ సహా అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించాలని తీర్పు

చిలకలపూడి (మచిలీపట్నం): వినియోగదారునికి వడ్డీ సహా అడ్వాన్స్‌గా ఇచ్చిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయలలు మంగళవారం తీర్పు చెప్పారు. కోడూరుకు చెందిన కె.పోతయ్య గుంటూరుకు చెందిన శ్రీ షిర్డీ సాయి బృందావనం ఎవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ప్లాటును 2017లో రూ. 22.50 లక్షలకు బుక్ చేసుకున్నారు. అడ్వాన్స్‌గా రూ. 4.10 లక్షలు చెల్లించారు. 18 నెలలపాటు వాయిదాల పద్ధతిలో మిగతా చెల్లించాలని ఒప్పందం చేసుకున్నారు. అప్పటి నుంచి శ్రీ షిర్డీ సాయి బృందావనం ఎవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వాయిదా సొమ్ము తీసుకోకపోగా.. ప్లాటు రిజిస్ట్రేషన్ కూడా చేయలేదు. దీంతో పోతయ్య నోటీసులు పంపారు. అయినప్పటికీ ఫలితం లేకపోవటంతో ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన అనంతరం కమిషన్ సభ్యులు అగ్రిమెంట్ కాలం పూర్తయిన నాటి నుంచి 9 శాతం వడ్డీ చెల్లించాలని, అడ్వాన్స్ మొత్తం తిరిగి ఇవ్వాలని తీర్పు చెప్పారు. మానసిక వేదనకు గురిచేసినందున రూ. 25 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు.

ఆగని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నిరసన

తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట జీఓ నెంబర్ 115 కాపీలను దహనం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. మానవహారంలా ఏర్పడ్డారు. జీఓ విడుదల చేసిన నాటి నుంచి జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు ప్రభుత్వ తీరుపై నిరసన తెలుపుతున్నారు. ఆ జీఓను ఉపసంహరించుకుని, తమను రెగ్యులర్ చేసేవరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ నర్సుల పోరాట కమిటీ నేతలు తెలిపారు. అవసరమైతే అత్యవసర వైద్యసేవలు మినహా మిగతావన్నీ బంద్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ నేతలు స్వచ్ఛంద ప్రసాద్, రేణుక, శివమ్మ, స్వరూప, సౌజన్య, వాసు, హైమావతి, రమాదేవి, సురేష్, విజయ్, నూరి, కుసుమ, కోటేశ్వరి పాల్గొన్నారు.



జీవో ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం